

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
శుక్రవారం 15 మార్చి 2024



ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాభవన్ ముట్టడి

6



జీరో బిల్లు పరేషాన్



దేటా ఎంట్రీ సరి చేసుకుంటున్న వినియోగదారులు

- మున్సిపల్, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- అభయ హస్తం దరఖాస్తుల నమోదులో తప్పిదాలు
- గృహజ్యోతి వర్తించక సెస్ వినియోగదారుల అయోమయం
- డేటా ఎంట్రీతోనే వినియోగదారులకు తిప్పలు



మున్సిపల్ కార్యాలయం తెరవకముందే వచ్చిన వినియోగదారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గృహజ్యోతి వర్తించక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. డేటా ఎంట్రీలో జరిగిన పొరపాట్లతో జీరో బిల్లురాక పరేషాన్ అవుతున్నారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం వినియోగదారులు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, మండలాల్లో పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగు తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి జీరో బిల్లును మార్చి నెలతో ప్రారంభించింది. కొందరికి జీరో బిల్లులు రావడం, మరికొందరికి పూర్తి బిల్లు రావడంతో ఆందోళన చెందుతున్నారు. సిరిసిల్ల సెస్ ప్రధాన కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వారిని అభయహస్తం డేటా ఎంట్రీలో పొరపాట్లు సవరించుకోవాలని పంపిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లో సెస్ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 4న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గృహజ్యోతిని ప్రారంభించారు.

జీరో బిల్లుకు పరుగులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రధానంగా సిరిసిల్లలో పవర్‌లూం నేత కార్మిక కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ కుటుంబాల్లో ఎక్కువ శాతం 150 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించడం లేదు. నేత కుటుంబాల్లోనూ చాలా మందికి జీరో బిల్లు రాకపోవడంతో తెల్లవారడంతోనే మున్సిపల్ కార్యాలయం వద్ద డేటా ఎంట్రీ సమస్యను పరిష్కరించుకోవడానికి క్యూ కడుతున్నారు. మండల కేంద్రాల్లో పరిషత్ కార్యాలయాల వద్ద దరఖాస్తుదారులు మళ్లీ క్యూలైన్లు కట్టే పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో డేటా ఎంట్రీ ఆపరేట్లతో నమోదు చేసే క్రమంలో ఆపరేటర్లు చేసిన తప్పిదాలతోనే గృహజ్యోతి పథకం అందని పరిస్థితి ఏర్పడినట్లు గుర్తించారు.

గృహజ్యోతికి సంబంధించిన అర్హులు కనెక్షన్ల వారీగా సెస్ సిబ్బంది ముందుగానే కనెక్షన్ల వారీగా వివరాలను సేకరించారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా రేషన్ కార్డులు ఆధార్ ఫోన్ నంబర్లను సేకరించారు. జిల్లాలో ఆరు గ్యారంటీలకు సంబంధించి 1,92,617మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో గృహజ్యోతి పథకంలో 200 యూనిట్లకు సం బంధించి 1,42,966 మంది అర్హులుగా దరఖాస్తుల్లో పేర్కొన్నారు. జిల్లాలో 1,73, 768 రేషన్ కార్డులున్నాయి. ఇందులో ఎక్కువ శాతం ఉచిత విద్యుత్‌కు అర్హులుగానే ఉన్నారు. సెస్ పరిధిలో గృహాలకు సంబంధించిన కనెక్షన్లు 1,69, 941 ఉన్నాయి. వినియోగదారుల నుంచి సెస్ సిబ్బంది 1,67,529 కనెక్షన్లకు సంబంధించిన వివరాలను డేటా ఎంట్రీ చేశారు. 200 యూనిట్లకు అర్హులుగా 82,845 మందిని గుర్తించారు. ఇందులో చాలా మందికి మార్చి నెలలో జీరో బిల్లు రావడం లేదు. ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజాపాలనలో వచ్చిన అభయహస్తం దరఖాస్తులను డేటా ఎంట్రీ సరిగా లేకపోవడంతోనే సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతో వినియోగదారులు డేటా ఎంట్రీపై ఆందోళన చెందుతున్నారు.

అద్దెకున్న వారికి వర్తించని వైనం

గృహజ్యోతి పథకంలో అద్దెకు ఉన్నవారికి సైతం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తింపజేస్తున్నట్లు ప్రకటించడంతోపాటు అద్దెకు ఉన్న వారి తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డుల వివరాలు కూడా డేటా ఎంట్రీ చేశారు. తెల్లరేషన్ కార్డు కలిగి అద్దెకు ఉంటున్నవారు జిల్లాలో ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారిలో జిల్లాలో బోయినపల్లిలో 11,905, చందుర్తి 10,963, గంభీరావుపేట 14,404, ఇల్లంతకుంట 15,553, కోనరావుపేట 13,919, ముస్తాబాద్ 14,385, రుద్రంగి 4846, సిరిసిల్ల 26, 833, తంగళ్లపల్లి 14,099, వీర్నపల్లి 4205, వేములవాడ 19,568, వేములవాడ రూరల్ 7440, ఎల్లారెడ్డిపేటలో 15648 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరిలో సిరిసిల్ల, వేములవాడలో ఎక్కువమంది పిల్లలను చదివిస్తూ, ఉపాధి పొందుతూ అద్దె ఇళ్లలో ఉన్నారు. వారి డేటా సేకరించిన జీరో బిల్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రేషన్ కార్డుకు ఒక సర్వీస్‌కే వర్తించినట్లు తెలుస్తుంది.

సెస్ పరిధిలో 82,845 మంది అర్హులు

జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 1,69,941 కనెక్షన్లు ఉన్నా గృహజ్యోతికి సంబంధించి 82,845 సర్వీసులను గుర్తించారు. వీరికి 200 యూనిట్లు వర్తించే విధంగా జీరో బిల్లు ఇస్తున్నారు. ఇందులో సిరిసిల్ల టౌన్ 1లో 6963, సిరిసిల్ల టౌన్2లో 4824, వేములవాడ టౌన్ 4648, వేములవాడ రూరల్ 4128, వేములవాడ అర్బన్ 4094, బోయినపల్లి 6112, చందుర్తి 7263, కోనరావుపేట 6797, తంగళ్లపల్లి 8236, ఇల్లంతకుంట 7824, ఎల్లారెడ్డిపేట 1లో 7791, ఎల్లారెడ్డిపేట 2లో 1800, ముస్తాబాద్ 6128, గంభీరావుపేటలో 6237 గృహ జ్యోతికి అర్హులుగా గుర్తించారు. గృహజ్యోతిలో 200 యూనిట్లు దాటిన వారికి జీరో బిల్లు వర్తించడం లేదు. 200 యూనిట్లకు తగ్గించుకున్న వారికి వచ్చే నెలలో మళ్లీ జీరో బిల్లు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. జీరో బిల్లు అర్హులుగా ఉన్నవారు మాత్రం బిల్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

సిరిసిల్ల రూరల్, మార్చి 14 : విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. అంతకుముందు డీఈవో రమేష్ హాజరై పదవ తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లను అందజేశారు. వార్డు కౌన్సిలర్ భూక్య రెడ్డి నాయక్, ప్రధానోపాధ్యాయుడు గణేష్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాకావత్ మోతిలాల్, దాతలు బోప్పదేవయ్య, అన్నల్‌దాస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 14 : పేదల కళ్లల్లో ఆనందం నింపడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని వెంకటరావుపేట, కొండాపూర్, నిమ్మపెల్లి, మరిమడ్ల, కొలనూరు, నాగారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. వెంకట్రావుపేట, కొండాపూర్ గ్రామాలకు గెలిచిన అనంతరం మొదటిసారిగా రావడంతో ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి రాగానే ఆరు గారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో గెలిచిన రెండు నెలల్లోనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతోపాటు పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల వరకు పెంచామన్నారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో 500కే సిలిండర్ ఉందని అదే మాదిరిగానే ఇప్పుడు అందిస్తున్నామన్నారు. రైతులకు ఎరువుల గోదాములు పెంచాలని కలెక్టర్ సమావేశంలో సూచించినట్లు చెప్పారు. మరిమడ్లలో ఎరువుల గోదామును రైతులు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి సామాజిక వర్గాలకు 16 కార్పొరేషన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ దేవరకొండ చారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడి, చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, కచ్చకాయల ఎల్లయ్య, ఫిరోజ్ పాషా, అబ్దుల్ రషీద్, తాళ్లపెల్లి ప్రభాకర్, పల్లె మంజుల రవీందర్ రెడ్డి, మానుక సత్యం, నాలుక సత్యం, నాయని ప్రభాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, గొట్టె రుక్మిణి, ఉప్పుల గంగయ్య, నందు గౌడ్, లింబయ్య టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 14: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతీ ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు గ్రామంలో 2, 3 మహిళా సంఘాలు ఉంటే పాఠశాలకు దగ్గరగా ఉన్న మహిళా సంఘానికి మొదటి సంవత్సరం అవకాశం కల్పించాలని, కమిటీ అధ్యక్షులు మెంబర్ కన్వీనర్ కలిసి పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లుల కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తారని అన్నారు. రెండు సంవత్సరాలపాటు పాఠశాల నిర్వహణ కమిటీ ఉంటుందని, అమ్మ పాఠశాల నిర్వహణ కమిటీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయించామని, జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాంలో కుట్టే సామర్థ్యం గల మహిళా సంఘాలను గుర్తించి వారికి వెంటనే ఆర్డర్ అందించాలని కలెక్టర్లకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద రూ.25 వేల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించవచ్చని, మిగిలిన పనులు జిల్లా సమాఖ్యకు కేటాయించాల్సి ఉంటుందని అన్నారు. డీఎంఎఫ్‌టీ, ప్రత్యేక అభివృద్ధి నిధులు, నరేగా నిధులను వినియోగించుకొని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాఠశాలలో చేపట్టిన పనులకు లక్ష రూపాయల వరకు ఎంపీడీవో పరిశీలించి బిల్లులు చెల్లిస్తారన్నారు. లక్షకు పైగా పనులకు ఎంబీ రికార్డు బుక్‌లను పరిశీలించి కలెక్టర్ చెల్లింపులు చేస్తారని, అవసరమైన నిధులు కలెక్టర్ వద్ద అందుబాటులో ఉంచుతామని అన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, ముఖ్య ప్రణాళికా అధికారి శ్రీనివాసాచారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్, మైనింగ్ ఏడీ రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

కుల సంఘాల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

వేములవాడ టౌన్, మార్చి 14 : బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతీ కుల సంఘం అభివృద్ధికి కృషి చేసిందని జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. వేములవాడ మండలం అనుపురంలోని గౌడ కులస్థులకు రూ.3 లక్షల నిధుల ప్రొసీడింగ్ కాపీని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రవి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సబ్బండ వర్గాల అభ్యున్నతికి పాటుపడిందన్నారు. అనంతరం కుల సంఘం భవనానికి నిధులు మంజూరుకు కృషి చేసిన జడ్పీటీసీ మ్యాకల రవిని, మాజీ సర్పంచ్ కొండపల్లి వెంకటరమణరావును గౌడ కులస్థులు సన్మానించారు.

మహిళల రక్షణ కోసమే షీటీంల ఏర్పాటు

ఇల్లంతకుంట, మార్చి 14:మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం షీటీంలను ఏర్పాటు చేసిందని ఏఎస్సై ప్రమీల అన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వివక్షతకు గురైతే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దూస గోవర్ధన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ హామీలు హాస్యాస్పదం

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



రచ్చబండలో మాట్లాడుతున్న బండి సంజయ్

బోయినపల్లి, మార్చి 14: మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లతోపాటు ఏటా లక్ష రూపాయలను అందిస్తామని రాహుల్ గాంధీ హామీలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా బోయినపల్లి మండలం బూరుగుపల్లి, కోరెం, బోయినపల్లి, విలాసాగర్, వెంకట్రావుపల్లె గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలను మోసం చేసిందని అన్నారు. బడ్జెట్ కేటాయించకుండానే రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేయడం విడ్డూరమన్నారు. రాష్ట్ర అధికార పార్టీ నాయకులు గ్రామాల్లోకి వచ్చినపుడు హామీల అమలుపై నిలదీయాలన్నారు. మోదీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో మరో మారు ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలన్నారు. దమ్ముంటే పార్లమెంట్ ఎన్నికల్లో సగం టికెట్లు మహిళలకు ఇవ్వాలన్నారు. టిక్కెట్లు ఇవ్వడం మీ చేతుల్లో ఉన్నదే కదా అన్నారు. వాటిని అమలు చేసిన తరువాత హామీల గురించి మాట్లాడాలన్నారు. తెలంగాణలో ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలకే దిక్కు లేదని, మహాలక్ష్మీ పథంలో ఒక్కో మహిళ అకౌంట్‌లో నెలకు రూ.2500 జమ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు వదిలిపెట్టబోమన్నారు. ఇదే సమయంలో ప్రజలతో బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాముడి గుడి నిర్మాణం గురించి తరతరాలు చెప్పుకుంటారన్నారు. పేదల కోసం పనిచేసే మోదీకి ఓటు వేయాలన్నారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా అమలు కాలేదని, ఎన్నికల కోడ్ పేరిట మళ్లీ కాంగ్రెస్ హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని అన్నారు. అనంతరం కోరెంలో ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బూరుగుపల్లి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్నూరు కాపు సంఘం భవనానికి భూమిపూజ చేశారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ బండి సంజయ్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే నరేంద్రమోదీ క్యాబినేట్‌లో మంత్రి కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఎదురులేదని వీర్రవిగుతున్న బీఆర్ఎస్‌ను ఓడించవచ్చని నిరూపించిన తొలి ఎన్నిక దుబ్బాక అన్నారు. మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, శ్రీనివాసరెడ్డి, కొనకటి హరీష్, కళ్యాణం అనిల్, వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాహితయాత్రలో అభివాదం చేస్తున్న బండి సంజయ్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



యువతితో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ టౌన్, మార్చి 14 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. వేములవాడ మండల అనుపురం గ్రామంలో నాబార్డ్ సౌజన్యంతో స్వశక్తి మహిళా సంఘాలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో మిల్లెట్స్ తినుబండారాల తయారీ, టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వశక్తి మహిళా సంఘాలతో కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించడానికి పలు పథకాల కింద తక్కువ వడ్డీకి, సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. అనంతరం టైలరింగ్ శిక్షణ తీసుకుంటున్న మహిళల వివరాలు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్‌లో అందిస్తున్న శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 14: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా తన చాంబర్‌లో సిరిసిల్ల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, మల్టీలెవల్ మార్కెంటింగ్ విధానాల ద్వారా వస్తువుల కొనుగోలు చేసినా అందరూ వినియోగదారులేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతిప్రకాష్‌శుక్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం



ఉత్సవ కమిటీ సభ్యులతో రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ టౌన్, మార్చి 14: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతరకు ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులను ఆలయ ఈవో కృష్ణప్రాద్ గురువారం సన్మానించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి జాతర విజయవంతంగా పూర్తి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను సన్మానించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఏఈవోలు జయకుమారి, శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు ఎడ్ల శివసాయి ఉన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 14 : పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రాజీవ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బాలగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రకృష్ణప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి నాగరాజుగౌడ్, ఈసీఐ ముత్తయ్యగౌడ్, ప్రధానోపాధ్యాయుడు విష్ణు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

తంగళ్లపల్లి, మార్చి 14: తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి భూమి పూజ చేశారు. గురువారం మండలంలోని గోపాలరావుపల్లెలో ఓపెన్‌జిమ్ నిర్మాణానికి, గొర్రెల షెడ్డు వద్ద బోర్ పాయింట్ కోసం భూమి పూజ చేశారు. ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు ధర్మారెడ్డి హారికరెడ్డి, నాయకులు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, పొన్నాల పర్శరాములు ఆరేపల్లి బాలు, మీరాల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

చందుర్తి, మార్చి 14 : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంతో పాటు సనుగుల, కిష్టంపేట, రామారావుపల్లి గ్రామాలలో గురువారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లోనే పెద్ద ఎత్తున మండలానికి నిధులు తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నటువంటి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రికి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపటి రామస్వామి, ఎంపిటిసిలు పులి రేణుక, మ్యాకల గణేష్, నాయకులు భీమరాజు కనకరాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, మార్చి 14: విద్యుదాఘాతంతో గురువారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పట్టణంలోని కమాన్ రాజీవ్ రహదారి ప్రాంతానికి చెందిన కాటన్ శ్రీనివాస్ తన ఇంటి రెండో అంతస్తులో ఉన్న ఇనుప పైపులను తీస్తుండగా పైన ఉన్న 11 కేవీ లైన్లకు తగిలి విద్యుత్ సరఫరా అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 14: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ఆదికేశవ పెరుమాండ్ల స్వామి గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.20,080 నగదు, నాలుగు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని వివరించారు.

రేషన్ బియ్యం గోదాంకు తరలింపు

ధర్మారం, మార్చి 14: మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని భైరెడ్డిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 150 క్వింటాళ్ల రేషన్ బియ్యంను గురువారం ధర్మారం నుంచి సివిల్ సప్లై అధికారులు పెద్దపల్లి ఎంఎల్ఎస్(గోదాం)కు తరలించారు.

బుధవారం భైరెడ్డిపల్లిలో నలుగురు వ్యక్తులు అక్రమంగా రేషన్ బియ్యంను నిల్వ చేశారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి అక్కడి నుంచి ధర్మారంలోని రేషన్ దుకాణంలో భద్రపరిచారు. ఇక్కడి నుంచి గురువారం సాయంత్రం సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్‌లు శంకర్, రవీందర్‌రాథోడ్, పెద్దపల్లి, మంథని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు మల్లికార్జున్, శ్రీనివాస్ పెద్దపల్లి ఎంఎల్ఎస్(గోదాం)కు తరలించారు.

చికిత్స పొందుతూ వలస కార్మికురాలి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 14: మండలంలోని ఓ ఇటుక బట్టీలో బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవపూర్‌లోని ఓ ఇటుక బట్టీలో పనిచేసేందుకు ఒరిస్సా నుంచి సమిత్ర బోయి(57) కార్మికురాలు వచ్చింది.

అనారోగ్య సమస్యలు ఉన్నాయని, బుధవారం ఆస్తమా ఎక్కువ కావడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త సర్తా బోయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్‌ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ ఛైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్‌ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.



ప్రణీత్‌రావు (ఫైల్)

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్క్‌లు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరఫు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్‌ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.



రాగిడి లక్ష్మారెడ్డి



ఆత్రంసక్కు

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 14: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను అధికారులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లఘనపై తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత మనమంతా భారత ఎన్నికల కమిషన్ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదన్నారు. సి-విజల్ యాప్, 1958 టోల్ ఫ్రీ నంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విధుల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు నగదు, ఇతర ఆభరణాలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో జరిగే రాజకీయ సభలు, ర్యాలీలను పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, కుర్చీలు, స్టేజి, సౌండ్ ఏర్పాట్లు, భోజనం తదితర వివరాలు నమోదు చేయాలని అన్నారు. అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకోవాలని, వీడియో తీసి పంచనామా చేయాలని అన్నారు. అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడం, ఖర్చుపై నివేదిక తయారు చేసే విధానంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీ లకులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వే లెన్స్, వీడియో వ్యూయింగ్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకరం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 14: రాష్ట్ర ప్రభుత్వం కుల సంఘాలకు సంబంధించి కార్పొరేషన్‌లను ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ సిరిసిల్లలో గురువారం పద్మశాలి, మేర సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్న ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మహిళా అధ్యక్షురాలు కామిని వనిత, మండల సత్యం, యెల్లె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● మేర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఓదేల శ్రీనివాస్, రామగిరి చంద్రయ్య, మాడిశెట్టి నర్సయ్య, టెంపరవెల్లి శ్రీనివాస్, రామగిరి భాస్కర్, వెన్ను నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు కొత్తపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు ఉన్నారు.

గంభీరావుపేట మండల రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల రెడ్డి సంఘం నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజనర్సింహరెడ్డి, రామాచంద్రారెడ్డి, అర్జున్‌రెడ్డి, సంజీవరెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ గ్రామ రెడ్డి సంఘం సభ్యులు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మొదట గ్రామంలోని రాజాబహద్దూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. రెడ్డి సంఘం సభ్యులు చిన్ని లక్ష్మారెడ్డి, దమ్మ ముత్యం రెడ్డి, నక్కల రాంరెడ్డి, కుంబాల మల్లారెడ్డి, సారగొండ రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు బొప్పాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు, రెడ్డి సంఘం సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు నర్సయ్య లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌రెడ్డి, అంజయ్య, బాల్‌రెడ్డి, రాములు, రఫీక్, శ్రీనివాస్, తిరుపతి, మహేందర్, కనకరాజు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మునిగల రాజు, రంగు అంజయ్య, దేవుని నరసయ్య, చుక్క శేఖర్ తదితరులు ఉన్నారు

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని పద్మశాలి సంఘం, పట్టణ, మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరా భిషేకం నిర్వహించారు. వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, గంజి జైపాల్ రెడ్డి, బారాజు రమణరెడ్డి, రాఘవరెడ్డి, నారాయణరెడ్డి, సంజీవ్ రెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, నాగిరెడ్డి పద్మశాలి సంఘం నాయులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు బాల్ రెడి, కచ్చకాయల ఎల్లయ్య, ఉప్పుల గంగయ్య, రాజు, సురేష్, విష్ణు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముదిరాజ్‌ల ధర్నా

ముస్తాబాద్, మార్చి 14 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ముదిరాజ్ కులస్థులకు 984 సర్వే నంబరులో 13 ఎకరాల 39 గుంటల స్థలాన్ని అప్పగించాలన్నారు. యాభైఏళ్ల క్రితం తమ సామాజిక వర్గానికి చెందిన కొంత మందిపేర ప్రభుత్వ భూమిని పట్టా చేశారన్నారు. ఇన్నాళ్లు సాగు చేసుకున్నామని, డబ్బులు వెచ్చించి సదరు స్థలాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. కొంత మంది సంఘానికి ఇచ్చారని మరికొంత మంది తమదేనని పేర్కొంటున్నారని ఆరోపించారు. ఆ స్థలాన్ని 200 మంది పేర చేయాలని కోరారు. లింగం కుంట స్థలం విషయంలో ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పుల్లూరి రవి, రంజాని నరేశ్, పుల్లూరి రవి, బద్ద శ్రీనివాస్, గజ్జెల రాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

కోనరావుపేట, మార్చి 14 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోనరావుపేట మండల విభాగం అధ్యక్షుడు ముష్టం జీవన్ గౌడ్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో యువజన విభాగం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగసాని రమణారెడ్డి, యువజన విభాగం నాయకులు చక్రాల వేణు, చీటినేని శివతేజ రావు, చంద్రకాంత్, రాకేష్ యాదవ్, గాజుల వినయ్, శ్రీపాల్ రెడ్డి, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పై దినోత్సవం

రుద్రంగి మార్చి 14: రుద్రంగి మండల కేంద్రంలోని పాఠశాలల్లో జాతీయ పై దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జాతీయ పై దినోత్సవంలో భాగంగా విద్యార్థులు పై డే అనే ఆకృతిలో కూర్చున్నారు. కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ఉపాధ్యాయులు విజయ్, రమేష్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

బోరు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట, మార్చి 14 : కోనరావుపేట మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన సంఘం బోర్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కచ్చకాయల బాల్ రెడ్డి, నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, దండు విష్ణు డిమాండ్ చేశారు. గురువారం కోనరావుపేట ఎస్సై అంజనేయులుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన దండు శ్రీనివాస్, దండు చిన్న ముత్తయ్య బోర్‌ను తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కాపు సంఘం నాయకులు ఉప్పుల గంగయ్య సాసాల రాజు, అవురం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు సరికాదు

చందుర్తి, మార్చి 14 రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం సరికాదని చందుర్తి మండల బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు మ్యాకల ఎల్లయ్య, ఈర్లపల్లి రాజు గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వ హామీలపై ప్రశ్నించిన లింగంపేట ఎంపీటీసీ రమేష్‌రావుపై కేసు పెట్టడం హేయమైన చర్యన్నారు. ప్రశ్నించిన గొంతులను నొక్కివేసే విధంగా ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోందన్నారు. లింగంపేట ఎంపీటీసీపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఖండించారు. ఎంపీపీ బైరగోని లావణ్య-రమేష్, వైస్ ఎంపీపీ అబ్రహం, సింగిల్ విండో చైర్మన్లు జలగం కిషన్‌రావు, తిప్పని శ్రీనివాస్, నాయకులు చిలుక పెంటయ్య, డప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, లింగంపల్లి కరుణాకర్, దుమ్ము ఆనంద్, కొమ్ము రమేష్, గంద్ర లక్ష్మణరావు, బత్తుల కమలాకర్, నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, వెంగళ శ్రీకాంత్, ఆకుల ఎల్లయ్య, పోతరాజు నగేష్, డప్పుల మోహన్, చిలువేరు రవి, తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ఇల్లంతకుంట, మార్చి 14: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం కోసం నిధులు మంజూరడంపై ప్రధానోపాధ్యాయిని ప్రేమ లత హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో టాయిలెట్లు లేవని చెప్పడంతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి రూ.3.25 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మహేష్‌చంద్ర, రమణారెడ్డి, తూముకుంట మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించిన మాజీ ప్రజాప్రతినిధిపై చర్యలు తీసుకోవాలి

చందుర్తి, మార్చి 14 : మండలంలోని ఎనగల్‌లో రోడ్డును అక్రమంగా పట్టా చేసుకొని ఇతరులకు విక్రయించిన ఓ మాజీ ప్రజాప్రతినిధిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన లింగంపల్లి హనుమంతు గురువారం ఎస్సీకి ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారుల అండదండలతో కబ్జా చేసి అతడి బంధువులకు విక్రయించాడని ఆరోపించాడు. ఈ విషయమై ప్రశ్నించగా తనపై దాడికి పాల్పడి దూషించాడని, తనకు న్యాయం చేయాలని కోరాడు.

అమర వీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి, మార్చి 14: తెలంగాణ సాయుధ పోరాట వీరుల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట అమర వీరుల వర్ధంతిలో భాగంగా మండలంలోని లక్ష్మీపూర్ శివారులోని సింగిరెడ్డి భూపతిరెడ్డి స్తూపం వద్ద సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి కాంస్య విగ్రహాలను జిల్లా కేంద్రంలోని కొత్తచెరువు కట్టపై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, కడారి రాములు, మండల కార్యదర్శి సోమ నాగరాజు, చంద్రకళ, అనురాధ, మమత, రాజవ్వ, బాలమణి, చందు, రాజేందర్, బాలమల్లు, రాజు, కొమరయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

సాగునీరు విడుదల చేయకుంటే మహాధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ వేణు

ఇల్లంతకుంట, మార్చి 14: మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయకుంటే రెండు రోజుల్లో రైతులతో కలిసి మహాధర్నా నిర్వహిస్తామని జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు లేక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదని, మధ్య మానేరు 10గేట్లు ఎత్తి నీటిని తీసుకపోతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు కనిపించడం లేదని విమర్శించారు. మధ్య మానేరు ద్వారా హుస్నాబాద్, జనగామ, సూర్యపేటకు నీరు వెళ్తోందని, భూములు కోల్పోయిన రైతులు పంటలు ఎండి తగలబెట్టుకున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యమానేరు గేట్లు మూసివేయాలని, అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి 2టీఎంసీల నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.80వేల పరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు గజ్జల రాజశేఖర్‌గౌడ్, బిల్లవేని పర్శరాం, గంగాధర కిష్టయ్య, సాదుల్, సలీం, నరేష్, రాగటి రమేష్, మరళీ, శ్రీనివాస్‌రెడ్డి, పండుగు నారాయణ, లక్ష్మన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తంగళ్లపల్లి, మార్చి 14: తంగళ్లపలి మండలం పాపయ్యపల్లె శివారులో గురువారం తెల్లవారు జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగళ్లపల్లికి చెందిన మిడిదొడ్డి పవన్ (20) మృతి చెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. తంగళ్లపల్లికి చెందిన పవన్, రాజు, అఖిల్ ద్విచక్ర పెళ్లి వేడుకల్లో పాల్గొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నారు. పాపాయ్యపల్లి మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న మిడిదొడ్డి పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు, అఖిల్ తీవ్రంగా గాయపడ్డారు. గాయాలైన ఇద్దరు యువకులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సముద్రలింగాపూర్‌లో చోరీ

గంభీరావుపేట, మార్చి 14 : గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్‌లో తాళాలు వేసిన మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలోని మోతె నరేందర్‌రెడ్డి ఉపాధి కోసం దుబాయి వెళ్లగా భార్య స్వాతి ఇద్దరు కూతుళ్లతో ఇంటి వద్ద ఉంటోంది. కూతుళ్లు చదువుతున్న గొల్లపల్లిలోని స్కూల్‌లో బుధవారం ఫెస్టివల్ ఉండగా తాళం వేసి వెళ్లింది. రాత్రి 2.30 గంటలకు తిరిగి వచ్చే సరికి 13 తులాలన్నర బంగారం, 100 తులాల వెండి, 50 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అక్కడికి సమీపంలో తాళాలు వేసిన మరో రెండు ఇళ్లలో దొంగలు పడ్డారు. ఆ ఇళ్లలో చిన్న చిన్న వస్తువుల మాత్రమే పోయాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్

కోనరావుపేట, మార్చి 14: కష్టపడి చదివినప్పుడే మంచి భవిష్యత్ లభిస్తుందని సుద్దాల ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం మంజులదేవి అన్నారు. సుద్దాల ప్రభుత్వ పాఠశా లలోని 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దని సూచించారు. మాజీ ఉపసర్పంచ్ నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ విజయ్, కొలనూరు సింగల్ విండో వైస్ చైర్మన్ మహేష్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 14 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషలలో విశ్వబ్రాహ్మణ వర్గానికి అవకాశం ఇవ్వలేదని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ వర్గాన్ని గుర్తించి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు చందనగిరి గోపాల్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 16 కులాలకు కార్పొరేషన్‌లను ప్రకటించడం హర్షనీయమని, అందులో తమ వర్గాన్ని ప్రకటించకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను అర్పించిన శ్రీకాంతాచారి స్ఫూర్తితో రాష్ట్రం ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ వర్గాన్ని గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల సత్యం, తుమ్మనపల్లి రమేష్, సంకోజు రమేష్, బాగోజి అంజనేయులు, తిప్పవరం రవీందర్, స్థంభంపల్లి రామచంద్రం, సంకోటి సత్తయ్య, అల్వాల లక్ష్మణ్, కలవకూడ రాజు, చొప్పదండి లక్ష్మణ్, జగదీశ్వర్‌చారి, మామిడి పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే చేరికలు

వేములవాడ టౌన్, మార్చి 14 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రతీ ఒక్కటి అమలు చేస్తుండడంతో జనాల్లో కాంగ్రెస్ పార్టీపైన నమ్మకం పెరుగుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 సిలిండర్ పంపిణీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌తో ప్రజలకు మరింత నమ్మకం కలిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. సింగిల్ విండో డైరెక్టర్‌లు సిలివేరి సత్తయ్య, పోచవేని నాగరాజు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ అల్లం ఆరోగ్యమ్మ, ధామస్‌రెడ్డి, సిలివేరి శ్రీనివాస్, కాశ శ్రీనివాస్, రాగిరి నాగరాజు, బొజ్జ భారతి, ఇన్నారెడ్డి, జ్యోతి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎల్లారెడ్డిపేట, మార్చి 14: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, పదిర, నారాయణపూర్ గ్రామాల్లో ప్రత్యేక నిధులతో తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గురువారం ఆయన భూమి పూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి సర్కారు పెద్దపీట వేస్తోందన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పరుస్తోందన్నారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపీటీసీ అపెరాసుల్తానా, మాజీ సర్పంచులు, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, మహేందర్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా మల్లికార్జునస్వామి కల్యాణం

ముస్తాబాద్, మార్చి 14: మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో యాదవ సామాజిక వర్గం ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి-కేతమ్మ, మ్యాడలమ్మ, రేణుకా ఎల్లమ్మ-మునిరాజుల కల్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా సాగింది. ఉత్సావాల్లో భాగంగా నాగవెల్లి పట్నం, ఒడిబియ్యం, ఒగ్గు కథ, అగ్ని గుండాలు అన్న ప్రసాద వంటి కార్యక్రమాలు నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు చెవుల ఎల్లయ్య, యాది మల్లేశ్, బత్తుల మహేశ్, మహేశ్, పర్శరాములు, తిరుపతి, రామస్వామి, నవీన్, యాదవ సంఘం సభ్యులు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు కలకొండ కిషన్‌రావు, ఈసరి కృష్ణ, ఎలుసాని దేవయ్య, చెవుల మల్లేశ్, పర్శరాములు, బాలెల్లం, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి..

ఎల్లారెడ్డిపేట, మార్చి 14: ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం అర్చకులు, ఒగ్గు కళాకారులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘం నాయకులు రవి, బాబు, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 14: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ కుమార్ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో జర్నీ టూ స్పేస్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి హాజరయ్యారు. విద్యార్థులకు చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1, గగన్‌యాన్‌తోపాటు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డైరెక్టర్ రఘునందన్‌కుమార్ అవగాహన కల్పించారు. ఇస్రో ఆధ్వర్యంలో చేపట్టనున్న యువిక 2024 పోటీ విద్యార్థులు సిద్ధం కావాలని కోరారు. జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, జీసీడీవో పద్మజ, డీఎస్‌వో దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

010 పద్ధతిని అమలు చేయాలి

ముస్తాబాద్, మార్చి 14: ప్రభుత్వం జీరో వన్ జీరో పద్ధతిని అమలు చేయాలని మండలంలోని నామాపూర్ మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్కూల్ టీచర్స్‌కు 010 ద్వారా జీతాలు చెల్లించాలని 010 సాధన సమితి బాధ్యులు రాజు, బసవయ్య, ప్రవీణ్, అనిల్ డిమాండ్ చేశారు. ప్రతీ నెల 15వ తేదీ వచ్చినా జీతాలు రాకపోవడంతో బ్యాంకు ఈఎంఐలు చెల్లించడం ఇబ్బందిగా మారిందన్నారు. అద్దెలు చెల్లించడానికి కష్టమవుతోందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీరోవన్‌జీరో పద్ధతిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు నర్సింలు, శరత్, దేవేందర్, అనూష, త్రివేణి, ప్రసూన, సుహాసిని, కళావతి, శైలజ, దేవయ్య పాల్గొన్నారు.

సంఘాల భవనాలకు ఎంపీ నిధులు మంజూరు



భూమిపూజ చేస్తున్న నాయకులు

ముస్తాబాద్, మార్చి 14: ముస్తాబాద్ మండల కేంద్రంలో పలు సంఘాల భవన నిర్మాణ పనులకు ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ పేర్కొన్నారు. గురువారం నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, జగదాంబతండాలో గురువారం ఎంపీ నిధులతో పలు కుల సంఘాల భవనాల నిర్మాణాల కోసం భూమిపూజ చేశారు. ఎంపీ బండి సంజయ్ నిధుల నుంచి పది కుల సంఘాల భవనాలకు రూ.3 లక్షల చొప్పున రూ.30 లక్షలు మంజూరయ్యాయి. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు గంట అశోక్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు దేవేందర్‌యాదవ్, నాయకులు కృష్ణకాంత్, సత్యనారాయణ, రమేష్, గణేష్, ప్రమోద్, శ్రావన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రం, జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, మిర్యాల్‌కార్ బాలాజీ తెలిపారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం మాట్లాడారు. ప్రధాని మోదీ, ఎంపీ బండి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు, కొలనూరు ఎంపీటీసీ ప్రవీణ్, రవి, మోత్కు మోహన్ పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో పలు అభివృద్ధి పనులకు బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షులు గునుగుల దేవేందర్ రెడ్డి తెలిపారు. ప్రొసీడింగ్‌లను అందించినట్లు పేర్కొన్నారు. రామలక్ష్మణ దేవాలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు ద్యావ రాజిరెడ్డి, సేవాలాల్ కమిటీ సభ్యుడు కేలోతు గంగ్యా పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధుల నుంచి మంజూరైన పలు అభివృద్ధి పనుల ప్రొసీడింగ్ కాపీలను బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి గురువారం అందజేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాభవన్ ముట్టడి



నిరాహార దీక్షలో కార్మికులు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 14 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమల సమస్యల పరిష్కరించకుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ దీక్షను ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గుడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణితోపాటు నాయకులు, కౌన్సిలర్లు, డైయింగ్ యూనియన్ అధ్యక్షుడు జగ్గాని మల్లేశం దీక్ష శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు అబ్బాస్ మాట్లాడుతూ సిరిసిల్లలో మూడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధిలేక నేతన్నలు పస్తులు ఉంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం దుర్మార్గమని అన్నారు. సిరిసిల్లలో నేతన్నల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ కూడా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ ఎంపీ బండిసంజయ్‌కుమార్ కూడా నేతన్నల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరి కుంట కిషన్, అడెపు సంపత్, గుండు రమేష్, మోర తిరుపతి, కంది మల్లేశం, రాము, అంబదాస్, రామచంద్రం, ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేష్‌లతోపాటు బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, వెంటళ శ్రీనివాస్, కౌన్సిలర్లు భూక్యరెడ్డి నాయక్, లింగంపల్లి సత్యనారాయణ, గుండ్ల పల్లి పూర్ణచందర్, అన్నరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల కోసం విద్యుత్ తీగల ఏర్పాటు

చందుర్తి మార్చి14 : వన్య ప్రాణుల కోసం వేటగాళ్లు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నట్లు చందుర్తి మండలం రామన్నపేట గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొందరు వేటగాళ్లు అటవీ ప్రాంతంలోని మన్నేరు బోర్ గుట్ట లొద్ది సమీపంలో వన్యప్రాణులను వేటాడేందుకు పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలను అమరుస్తున్నారు. మూడు రోజుల క్రితం ఓ రైతు పొలం వద్ద వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి 90పైగా కోతులు మృత్యువాత పడ్డాయి. కోతుల కళేబరాలను అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు, ఇటీవల రెండు దుప్పుల మాంసం కూడా విక్రయించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

నెల రోజులుగా అటవీ ప్రాంతంలో ట్రాక్టర్ ట్రాలీ

చందుర్తి, మార్చి 14: చందుర్తి మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో ట్రాక్టర్ ట్రాలీని గుర్తుతెలియని వ్యక్తులు వదిలేశారు. నెల రోజుల నుంచి అక్కడే ఉండడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో టేకు కలపను అక్రమంగా తరలించేందుకు కలప స్మగ్లర్లు దొంగతనంగా ఎత్తుకొచ్చి వది లేసినట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయమే చందుర్తి ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నేతన్నలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మార్చి 14: నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, త్వరలోనే ఆర్డర్ ఇవ్వడానికి సీఎం సుముఖంగా ఉన్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలని సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని భద్రావతి సొసైటీ ఆవరణలో ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు గురువారానికి తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులతో కలిసి కేకే మహేందర్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదంతోనే సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమలో కాటన్ వస్త్రం తయారీని బంద్ చేయించిందని, ఎందుకూ పనికి రాని బతుకమ్మ చీరలను తయారు చేయించిందని అన్నారు. బతుకమ్మ చీరలను తయారు చేయించిన కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రూ.290 కోట్లు చెల్లించకుండా ఇప్పుడు పదవి పోగానే ఆ బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలంటూ రోడ్డు ఎక్కడం సిగ్గుచేటన్నారు. నేతన్నలు అధైర్యపడవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. వస్త్ర పరిశ్రమకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు శుక్రవారం చేనేత జౌళిశాఖ కమిషనర్ అలుగు వర్షిణి సిరిసిల్లకు వస్తారని, యజమానులు, ఆసాములతో సమావేశాలను ఏర్పాటు చేసి జీవోల గురించి వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మండల సత్యం, వెల్దండి దేవదాస్, బూట్ల నవీన్, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, మ్యాన ప్రసాద్, వెల్ముల తిరుపతిరెడ్డి, గోనె ఎల్లప్ప, సామల దేవదాస్ గోలి వెంకటరమణలతోపాటు అసాములు గాజుల ఎల్లయ్య అర్చన పల్లి వంశీ, దుబాల సతీష్, మంత్రి రవి, చేరాల అశోక్ పాల్గొన్నారు.